## క్లుప్తంగా

### చిరుధాన్యాల సాగుతో అధికలాభాలు



**ఖిల్లాఘనపురం:** చిరుధాన్యాల సాగుపై రైతులు శ్రద్ధ తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పారెడ్డిపల్లిలో రైతువేదికలో వివిధపంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన జాతీయ ఆహారభద్రత మిషన్ పథకం ద్వారా వచ్చిన విత్తనాలను రైతులకు అందజేశారు. పురుగుమందులను మొదట్లోనే ఎక్కువ మోతాదు ఉన్న వాటిని వాడరాదన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



**గోపాల్‌పేట:** ప్రజల శ్రేయస్సుకోసం కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీసీలకోసం ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం ఆర్టీఏ జిల్లా చైర్మన్ కొంకి రమేష్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయబోతుండటం ఎంతో మంచి విషయమన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు శివన్న, శేఖర్, వెంకటయ్య పాల్గొన్నారు.

### బీజేపీ మండల కార్యవర్గం ఎన్నిక

**కొత్తకోట:** మండల బీజేపీ అధ్యక్షుడు చీర్ల నరసింహా ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, నూతన సభ్యులుగా నరసింహా, రవి కుమార్, రవీందర్‌రెడ్డి, రవికుమార్ రామకృష్ణాపురం, బ్రహ్మానాయుడు, శివశంకర్‌రెడ్డి, రవి, బాలకృష్ణారెడ్డి, రాజమౌళి, రవినాయక్, నర్మదా, పెద్దిలక్ష్మణ్, మొగిలి, శంకర్‌బాబు, రాజేశ్, విష్ణు, ఆనంద్‌లను ఎన్నుకున్నారు.

### వన మహోత్సవ లక్ష్యాన్ని సాధించాలి



**అమరచింత:** వన మహోత్సవం సందర్భంగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది కృషి చెయ్యాలని మండల ప్రత్యేక అధికారి అఫ్జలుద్దీన్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో పాటు ఈజీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలానికి 60 వేల మొక్కలను నాటేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### మండల ప్రత్యేక అధికారిగా అఫ్జలుద్దీన్

**అమరచింత:** మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అఫ్జలుద్దీన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రభుత్వ పరంగా కొనసాగాలంటే ప్రజలు సహకరించాలని కోరారు.

### ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**వనపర్తి రూరల్:** మండలంలోని రాజపేట గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఎంపీఓ రవీంద్రబాబు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, మాజీ సర్పంచ్ బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### శుభ్రతతో రోగాలు దూరం

**పానగల్:** ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన రోగాలు దూరంగా ఉండొచ్చని ఎంపీడీఓ గోవిందరావు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా కొత్తపేట గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. మండలంలోని కేతపల్లి, శాగాపూర్‌లో వైద్యసిబ్బంది పర్యటించి రోగాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# గాలిలో ప్రాణాలు..!



దుప్పల్లి-అమ్మాపురం సమీపంలో ఆటోలో వెళ్తున్న కూలీలు (ఫైల్)

- ఆటోలో పరిమితికి మించి కూలీల తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

**మదనాపురం:** అందరు పేదప్రజలే.. కాయకష్టం చేసి బతుకు జీవుడా అంటూ గడిపేవారు.. పొద్దంతా కష్టపడి సాయంత్రం ఇంటికి వచ్చి ఉన్నదాంట్లో కలోగంజో తాగి నిద్రపుచ్చుకునే జీలవితాలు వీరివి.. మట్టి బిడ్డల ఆర్థిక పరిస్థితులు బాగాలేక నాడు పాలమూరు లేబర్ కూలీలు మేస్త్రీల చెరలో పడి ఎన్నో జీవితాలు చీకట్లో నలిగిపోయాయి. నేడు గ్రామాల్లో ఆటోడ్రైవర్ల కూలీ ఆశ చూపించి చిన్న ఆటోలో 20మందికి పైగా ఎక్కించుకొని మహిళ కూలీలను తరలిస్తున్నారు. ఉదయం ఇంటినుంచి బయలుదేరే వీరికి ఇంటికి వచ్చే వరకు ప్రాణాలకు గ్యారెంటీ లేదు.

**నిబంధనలకు పాతర..**

ప్రధానంగా ఆటోడ్రైవర్లు ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. సుదూర ప్రాంతాలకు వ్యవసాయ పనులకు మహిళా కూలీలను పిల్లలను స్టీరింగ్ ఆటోలు మిని ఆటోల్లో విచ్చలవిడిగా తరలిస్తున్నారు. వాటి పరిమితికి మించి ఎక్కువసంఖ్యలో కూలీలను ఎక్కించి ప్రాణాలను గాల్లో పెట్టే విధంగా ప్రయాణం చేస్తున్నారు. 20 నుంచి 30 కిలోమీటర్లు వరకు కూలీలను తీసుకెళ్లి వ్యవసాయ పనులు చేయించి తీసుకొస్తున్నారు. పోయేటప్పుడు మహిళ కూలీలు ఆటోలకు వేలాడుతూ కనిపిస్తారు. ఈ పరిస్థితి చూసిన వారు ప్రతిఒక్కరూ ముక్కున వేలేసుకోక తప్పదు. సంబంధిత అధికారులు మాత్రం మొద్దునిద్రలో ఉంటూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. కొత్తకోట, మదనాపురం, మండలాలకు చెందిన కూలీలను దుప్పల్లి అమ్మాపురం, కురుమూర్తి ఆలయం, చిన్నచింతకుంట, అప్పంపల్లి, ముచ్చింతల, కొకుంట్ల మీదుగా దేవరకద్ర వరకు ఆత్మకూరు, మండలా లకు చెందిన కూలీలు అమరచింత, ఉంద్యాల, నర్వ మండలం వరకు మరికొందరు అల్లీపురం, వడ్డెమాన్, నెల్లికొండి, పెద్ద చింతకుంట, మరికల్, సుదూర ప్రాంతాలకు వెళ్లి కూలీ పనులు చేస్తున్నారు. అక్కడ పత్తి చేల్లో పనులు చేసి సాయంత్రం వేళల్లో ఇంటికి చేరుకునే వరకు రాత్రి 7 గంటల సమయం అవుతుంది. దినసరి కూలీ కేవలం రూ.350 పొద్దంతా కాయ కష్టం చేసి వస్తారు. కూలీడబ్బుల్లో రూ.50 ఆటో కిరాయి అంటూ కూలీలతో తీసుకుంటారు. సీజన్ మొత్తం ఆటో యజమానులు వ్యాపారంగా మలుచుకున్నారు.

**వాహనాలు భద్రమేనా?**

కూలీలను తరలించే ఆటోలు భద్రంగా ఉన్నాయా వాటికి అన్ని సక్రమంగా ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా కొన్ని ఆటోలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ పాటు డ్రైవర్లకు లైసెన్సులు అనుభవం తదితర వాటిని లేవనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిఘా పెట్టాలని కోరుతున్నారు.

**తనిఖీలు చేపడతాం..**

ఆటోలు పరిమితికి మించి కూలీలుగానీ ప్రయాణికులకు తరలించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రతిఆటో అన్ని సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఆటోనడిపితే సీజ్ చేస్తాం. ప్రజలు కూలీలు ఆటోల్లో ప్రయాణం చేయవద్దు, దీనిని ప్రతిఒక్కరూ గమనించాలి.

–వాసుదేవారావు, ఎంవీఐ, పెబ్బేరు

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం

- కమిషనర్ శశిధర్

**ఆత్మకూర్:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలను తీసుకుని రోగాలను తరిమెయ్యాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా వార్డులో సిబ్బందితో కలిసి ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. డ్రమ్ముల్లో, హౌసుల్లో తదితర వాటిల్లో నీరు నిల్వ ఉంచకుండా పారబోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సురేందర్‌గౌడ్, పురపాలిక సిబ్బంది తదితరులు ఉన్నారు.



పారిశుద్ధ్యంలో పాల్గొన్న కమిషనర్ శశిధర్

## తాత్కాలిక నిర్మాణాల తొలగింపు



కోర్టు రోడ్డు సమీపంలో నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

**వనపర్తిటౌన్:** జిల్లా కేంద్రంలో కలెక్టర్ రోడ్డులో మిగిలిపోయిన విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బస్టాండ్ నుంచి సమీకృత కలెక్టరేట్ మార్గం వరకు రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక తడకల, రేకు డబ్బాల నిర్మాణాలను శుక్రవారం పుర అధికారులు తొలగించారు. పొట్టి శ్రీరాములు చౌరస్తా నుంచి కలెక్టరేట్ రోడ్డు వరకు ఈ మార్గంలో 100 అడుగుల మేర విస్తరణ చేయనుండటంతో అందుకు అనుగుణంగా ముందస్తు ఆదేశాలతో తాత్కాలిక నిర్మాణాలను ఆయా యజమానులు తొలగించుకుంటున్నారు. అక్కడక్కడ కొందరు మొండికేస్తుండడంతో అలాగే ఉన్న నిర్మాణాలను జేసీబీతో టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. తొలిదశలో అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న చోట విస్తరణకు మార్గాన్ని అనువుగా మార్చుకుంటున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రాంతంలో ఉన్న తాత్కాలిక నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించిన అనంతరం విస్తరణ పరిధికి అడ్డుగా ఉన్న పక్కా నిర్మాణాలను సైతం యజమానుల ఆమోదంతో తొలగిస్తామని చెప్పారు. కేవలం తాత్కాలిక నిర్మాణాల తొలగింపుతో రోడ్డు పరిధి సరిపోయిన చోట ఒకట్రెండు రోజుల్లో బీటీ రోడ్డు వేయనున్నట్లు అధికారులు వెల్లడించగా సోమవారం తర్వాత అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అన్ని చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

### లక్ష్యం నిర్దేశించుకొని చదవాలి



**గోపాల్‌పేట:** పెద్దయ్యాక ఏం సాధించాలనే విషయాన్ని ఒక లక్ష్యంగా ఎంచుకొని కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పొలికెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటినుంచే క్రమశిక్షణతో పెరగాలని చెడు అలవాట్లు నేర్చుకోకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అత్యున్నత స్థాయిని లక్ష్యంగా ఏర్పాటు చేసుకుని చదవాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు గణితం పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈశ్వరచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్యపరీక్షలు

**ఆత్మకూర్:** విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రఫీఖ్, వసంత, సరిత పాల్గొన్నారు.

### రెవెన్యూ అధికారిగా సాయిరాం

**వనపర్తిటౌన్:** వనపర్తి మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వోగా) సాయిరాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 1994లో ఉద్యోగంలో చేరిన ఆయన బిల్ కలెక్టర్‌గా, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌గా గద్వాల్, వనపర్తి, కొల్లాపూర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. సీనియర్ అసిస్టెంట్ హోదాలో వనపర్తికి వచ్చిన ఆయనకు అదనంగా ఆర్వోగా ఇంచార్జి బాధ్యతలను కట్టబెట్టారు. విధిగా ఆస్తిపన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

### ఆఫ్ డే సెలవు ఇవ్వాలి

**వనపర్తిటౌన్:** మున్సిపల్ పారిశుద్ధ్య, వాటర్‌సప్లై ఎలెక్ట్రికల్ కార్మికులకు ఈ నెల 14న ఆఫ్ డే సెలవు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు కార్మిక సంఘం నాయకుడు రాములుతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా కనీసవేతనాలు, సౌకర్యాలు, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 14న పెబ్బేరులో మహాసభ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## తడి, పొడి చెత్త వేర్వేరుగా వాహనంలో వేయాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్ నాగరాజు

**అమరచింత:** తడి, పొడి చెత్తను చెత్తబండిలోనే వేయాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు కోరారు. వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 6 వార్డులో ప్రజలకు తడి, పొడి చెత్తను మురుగు కాల్వలో, రహదారులపై పారవెయ్యకుండా కాలనీలకు వస్తున్న చెత్తబండ్లలోనే వేసి పారిశుద్ధ్యం పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు. పట్టణంలోని ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఆవరణలో మొక్కలను నాటారు. వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. మురుగునీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న వర్కర్లు

**వనపర్తి విద్యావిభాగం:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలను పరిష్కరించడంతో పాటు నెలనెల మెనూ బిల్లులు గుడ్లబిల్లులు, గౌరవ వేతనం క్రమం తప్పకుండా చెల్లించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫిబ్రవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్న మెనూ బిల్లులు, గుడ్ల బిల్లులు, గౌరవ వేతనం చెల్లించాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ తోపాటు వర్కర్స్ హేమలత, భారతమ్మ గోవిందమ్మ, పాల్గొన్నారు.

### విద్యా వలంటీర్ల నియామకం



**ఆత్మకూర్:** సొంత నిధులతో దాతలు విద్యా వలంటీర్లను నియమిస్తూ విద్యాభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తున్నారు. మండలంలోని తిప్పడంపల్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తెలుసుకున్న మాజీఎంపీటీసీ సుచిత్రమ్మ, బీజేపీ రాష్ట్రనాయకుడు రాము వలంటీర్లను నియమించారు. ఈ మేరకు రూ.5వేల నగదును ఇస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ బాలరాజు, ఉపాధ్యాయులు దాతలను అభినందించారు.

### కిష్టంపల్లిలో సంత ప్రారంభం

**అమరచింత:** మండలంలోని కిష్టంపల్లి గ్రా మంలో వారంతపు సంతను ప్రజాప్రతిని . ధులు, గ్రామస్తులు శుక్రవారం ప్రారంభించా రు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ చెన్నమ్మ కురుమన్న, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బీజేపీ మండల కార్యదర్శి మల్లారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి సామాజిక స్పృహ అవసరం



సామాజిక సేవలో విద్యార్థులు

**కొత్తకోట రూరల్:** పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామశివారులో కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాలలోని విద్యార్థులు శుక్రవారం సామాజిక బాట పట్టారు. జాతీయసేవా పథకం ప్రోగ్రామ్ అధికారి విద్య ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిగట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్య మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటుగా సామాజిక స్పృహపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి, సురేష్, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య గౌడ్, పాల్గొన్నారు

### నిల్వనీటితో రోగాల బారిన పడతాం



**వనపర్తిటౌన్:** నిల్వనీటిని వాడితే రోగాలు దరిచేరుతాయని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో 100 రోజుల కార్యచరణలో భాగంగా ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఆయావార్డులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

### స్వచ్ఛతకు సహకరించాలి



**వీపనగండ్ల:** మండలంతోపాటు వివిధ గ్రామా ల్లో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ, ఏఎన్ఎంలు పారిశుద్ధ్య పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశానుసా రం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### సెల్‌ఫోన్ అప్పగింత

**ఖిల్లాఘనపురం:** మండలంలోని అల్లమాయపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఏడాది క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శుక్రవారం ఇంచార్జి ఎస్సై జయన్న బాధితుడికి అప్పగించారు. లక్ష్మయ్య సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. దీంతె శుక్రవారం సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి అప్పగించామని తెలిపారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**గోపాల్‌పేట:** మండలంలోని బుద్దారం గ్రామంలో ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రవణ్‌కుమార్ బాధిత కుటుంబానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం రూ.2వేలు అందజేశారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



**ఖిల్లాఘనపురం:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించడంపై శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలో తెలంగాణతల్లి చౌరస్తా దగ్గర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సింగల్ విండో వైస్‌చైర్మన్ క్యామరాజు, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేశ్, ప్రకాష్ పాల్గొన్నారు.

### సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలి



**పానగల్:** ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలు పెంచేవిధంగా బోధన చెయ్యాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నారం ప్రాథమిక, గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

### అమ్మపేరిట మొక్క నాటాలి

**ఆత్మకూర్:** అమ్మపేరిట ఒక మొక్క నాటి వాటిని సంరక్షించాలని ఎంఈఓ బాలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల పాఠశాల ఆవరణలో అమ్మపేరిట ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచేత మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ఎకోక్లబ్ బాధ్యుడు నాగప్రియ, మధుసూదన్, సంతోష పాల్గొన్నారు.



### ఘనంగా ఇంజినీర్స్ డే



**వనపర్తిటౌన్:** నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ ప్రజలు చరిత్రలో మరువలేని నిర్మాణాలు చేశాడని మహానీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్ ప్రకాశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో నవాబ్‌అలీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిరాజచారి, డాక్టర్ నరసింహశర్మ, బాలేమియా పాల్గొన్నారు.

### పుస్తకాల పంపిణీ

**అమరచింత:** మండలకేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు, వాటర్ బాటిళ్లను శుక్రవారం అందించినట్లు వార్డెన్ చంద్రన్ తెలిపారు. వ్యాయామంతో పాటు ఆటలు ఆడుకోనేందుకు క్రీడాసామగ్రిని ఏర్పాటు చేశామన్నారు.

### మేనేజర్‌కు సన్మానం

**వీపనగండ్ల:** మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న రవీందర్ బాబు బదిలీపై వెళ్తుండడంతో శుక్రవారం రైతుసంఘం నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. సీనియర్ మేనేజర్‌గా ప్రమోషన్ పొంది మహబూబ్‌నగర్‌కు బదిలీ అయ్యారు.

## జనాభా అధికమైతే వనరులు తగ్గుతాయి



వనపర్తిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునందన్



వీపనగండ్లలో ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది



ఆత్మకూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**వనపర్తిటౌన్:** జనాభా అధికమవుతుండటంతో వనరులు తగ్గుతున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జనాభా అధికమవుతుండటంతో వనరులు తగ్గుతున్నాయన్నారు. చిన్నవయస్సులో పెళ్లిళ్ల చేయడం, కుటుంబ నియంత్రణ పాటించకపోవడంతో జనాభా అధికమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధాంసింగ్, అధ్యాపకులు డా.యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

**ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ**

**వనపర్తి రూరల్:** పెబ్బేర్ పీహెచ్‌సీ పరిధిలోని పట్టణంలోని 8వ వార్డులో వైద్యసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీని డా.ప్రవళిక ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సత్యశ్రీ నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ లీలమ్మ, పార్వతి, స్వరూపరాణి, వైద్యసిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

**చిన్నకుటుంబం చింతలేని కుటుంబం**

**ఆత్మకూర్:** ఒకరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ముగ్గురు అసలే వద్దు అంటూ విద్యార్థులు నినదించారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా తిప్పడంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక బాలికల పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఫయాజ్‌అహ్మద్, ఎంఈఓ బాలరాజు, డాక్టర్ వసంత, డాక్టర్ సరిత, వైద్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, సురేష్‌కుమార్, విద్యాసాగర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో..**

**వీపనగండ్ల:** ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి రాజశేఖర్, ఆయూష్ డాక్టర్లు, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**పాన్‌గల్‌లో..**

**పాన్‌గల్:** మండల కేంద్రంలో ప్రపంచజనాభా దినోత్సవంలో భాగంగా శుక్రవారం విద్యార్థులచే మండల వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.